రేపటితో గడువు పూర్తి

- ఆదర్శ పాఠశాల ఇంటర్ ప్రవేశాల దరఖాస్తులకు శుక్రవారం తుది గడువు
- విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతి

యాచారం, మే 29 : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల విద్యార్థులకు ఆంగ్ల మా ధ్యమంలో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. మెరిట్ లిస్టు ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ చదివేందుకు పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఇక్కడ అన్ని రకాల వసతులు కల్పించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆదర్శ పాఠశాలలో చేర్పించి తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి. ఆదర్శ పాఠశాల ప్రవేశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతి కలదు.

–ఎమిమా, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్

కార్పొరేట్‌కు దీటుగా

మండలంలోని గున్‌గల్ గ్రామంలో 2013లో ఏర్పాటు చేసిన ఆదర్శ పాఠశాల కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కొనసాగుతున్నది. పక్కా భవనం, విశాలమైన మైదానం, మెరుగైన ఆంగ్ల బోధనను అందించే ఉపాధ్యాయ బృందం, గ్రంథాలయం, సైన్స్‌ల్యాబ్, డిజిటల్ తరగతులు, కె-యాన్ ప్రాజెక్టర్ రూమ్, ఉచిత మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ, కంప్యూటర్ పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులను తీర్చిదిద్దడం, ఒకేషనల్ విద్య, క్రీడల్లో శిక్షణ తదితర రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నది. బాలికలకు ఉచిత వసతి గృహ సదుపాయమూ ఉన్నది. ప్రైవేట్, కార్పొరేటు కళాశాలకు దీటుగా ఫలితాలను సాధిస్తున్నది. ఆదర్శ పాఠశాల విద్యార్థులు 2023-24లో ఇంటర్‌లో మంచి ఫలితాలను సాధించారు.

160 సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో 160 సీట్లున్నాయి. ఒక్కో గ్రూపులో 40 చొప్పున సీట్లు ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. టెన్త్ పూర్తైన వారు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలి.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల జాప్యంపై ఎమ్మెల్యే సబితారెడ్డి ఆగ్రహం

బడంగ్‌పేటలో ఇంటిగ్రేటెడ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, మే 29: బడంగ్‌పేట, తుక్కుగూడలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల్లో జాప్యంపై మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లపై మండిపడ్డారు. బడంగ్‌పేటలో రూ. 4 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. సంబంధిత అధికారులతో పనుల జాప్యంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో నియోజకవర్గంలో నాలుగు చోట్ల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల ఏర్పాటుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మార్కెట్ పనులు నత్తనడకన సాగడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. బడంగ్‌పేట, తుక్కుగూడలో మాత్రమే మార్కెట్ పనులు జరుగుతున్నాయన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి మార్కెట్ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని ఎమ్మెల్యే మండిపడ్డారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సకాలంలో ఇంటిగ్రేటెట్ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న మార్కెట్‌లలో ఏ మాత్రం నాణ్యత లోపించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. అధికారులు కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులను త్వరగా పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామిడి రాంరెడ్డి, పెద్దబావి ఆనంద్‌రెడ్డి, బీమిడి జంగారెడ్డి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటేశ్వర్లు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 29 : డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ వెంకటేశ్వర్లు అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ మండలాల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్‌లోని రైతు వేదికలో బుధవారం విత్తనాల అమ్మకాలు, చట్టాలు, ఇతర జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను రైతులకు సకాలంలో అందించాలన్నారు. వ్యవసాయ, పోలీస్‌శాఖలు కలిసి నకిలీ విత్తనాలు సరఫరా కాకుండా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌నాయక్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల వ్యవసాయ అధికారిణి పి కవిత, హయత్‌నగర్ వ్యవసాయ అధికారి బి సోల్మాన్‌నాయక్, టెక్నికల్ ఏవో సి రాధిక, సీడ్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు..

సదస్సుకు హాజరైన డీలర్లు

జీవాల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

కేశవగూడలో జీవాలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

షాబాద్, మే 29: జీవాల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారిణి డాక్టర్ స్రవంతి అన్నారు. బుధవారం మండలంలోని కేశవగూడ, నరేడ్లగూడ గ్రామాల్లో సిబ్బందితో కలిసి జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలు పోషించుకుని జీవనం సాగించే వారికి మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి, తమకు సమాచారం అందించాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బలరాం, రాణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, మే 29 : ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో స్థానిక నాయకులతో ఆయన పర్యటించారు. ఇటీవల గ్రామంలో వివిధ కారణాలతో మృతి చెందిన రమణమోని స్నేహ, కృష్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితులను ఓదార్చి రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్టు తరపున ఐదు వేల చొప్పున రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, డైరెక్టర్లు వెంకట్‌యాదవ్, జంగయ్య, మాజీ సర్పంచ్ యాదయ్య, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రాజు, నాయకులు శ్రీను, పర్వతాలు, యాదయ్య, గోపాల్, నర్సింహ, రమేశ్, వెంకటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుట్కా అమ్మితే చర్యలు

సీజ్ చేసిన గుట్కా ప్యాకెట్లు, దుకాణదారుడితో పోలీసులు

ఆమనగల్లు, మే 29 : ప్రభుత్వం నిషేధించిన గుట్కా, గంజాయి అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని మండల ఎస్ఐ బలరాంనాయక్ తెలిపారు. ఆమనగలులోని ఓ కిరాణా దుకాణంలో పోలీసులు శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్ సోదా చేయగా 4 గుట్కా ప్యాకెట్ల సంచులు లభ్యమైనట్లు ఎస్ఐ తెలిపారు. వాటిని సీజ్ చేసి దుకాణదారుడు సతీశ్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా అధ్యక్షుడు మట్టా రాజేశ్వర్‌రెడ్డి

షాబాద్, మే 29: మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా అధ్యక్షుడు మట్టా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, వనితా చేయూత ప్రాజెక్ట్‌లో భాగంగా శంకర్‌పల్లి మండలంలోని మోకిలా గ్రామంలో మహిళా శక్తి సంఘాల మహిళలకు కుట్టుమిషన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇలాంటి మంచి కార్యక్రమాన్ని సపోర్ట్ చేస్తున్నందుకు గర్వంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా మహిళా సంఘాలు వారికి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వనితా చేయూత అధ్యక్షురాలు వాణి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విద్యార్థుల స్కూల్ యూనిఫామ్స్ కుట్టే బాధ్యత మహిళా సంఘాలకు ఇవ్వడం జరిగిందన్నారు.

కుట్టు మిషన్లతో మహిళలు, ఫోరం సభ్యులు

మోకిలా మహిళా శక్తి సంఘాల విజ్ఞప్తి మేరకు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ముందుకు వచ్చి వారికి పది కుట్టుమిషన్‌లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఏవో సుజాత, అమ్మ ఆదర్శ కమిటీ మెంబర్ పద్మ, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ సుధాకర్, భీమయ్య, అనంతయ్య, ఆశోక్, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

షాబాద్, మే 29: జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు రంగారెడ్డిజిల్లా వ్యాప్తంగా 25935 మందికి గాను 24924 మంది హాజరయ్యారని తెలిపారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరం పరీక్షకు 6129 మంది హాజరు కావాల్సి ఉండగా.. 5769 మంది హాజరయ్యారు.

రెండు బైక్‌లు ఢీ.. వ్యక్తి మృతి

కడ్తాల్, (తలకొండపల్లి) మే 29 : రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం తలకొండపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం... మండలంలోని కర్కాస్‌తండాకు చెందిన సభావట్ కృష్ణ(45), తన బైక్‌పై తలకొండపల్లి గ్రామం నుంచి తలకొండపల్లి చౌరస్తాకు వెళ్తున్నాడు. ఆ సమయంలోనే కృష్ణ బైక్‌ను వెనుక నుంచి వచ్చిన రంజిత్‌చౌహాన్ బైక్ ఓవర్‌టేక్ చేస్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన కృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, రంజిత్ చౌహాన్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం దుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రంజిత్ చౌహాన్‌ను చికిత్స కోసం దవాఖానకు.. కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొర్రెల కాపరిపై దాడి

బడంగ్‌పేట, మే 29 : గొర్రెలు కాస్తున్న మహిళపై పాస్టర్ దాడి చేసిన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో అలస్యంగా వెలుగులోకి వచ్చింది. మీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడకు చెందిన పద్మ ఈనెల 24న సాయంత్రం 6 గంటలకు గొర్రెలను మేపుతుండగా దేవసహాయం అనే పాస్టర్ అసభ్య పదజాలంతో దూషించి దాడి చేశాడు. భయపడిన పద్మ పక్కనే ఉన్న కిరాణా దుకాణంలోకి పరుగులు తీసింది. అయినప్పటికీ వెంటపడి దాడిచేశాడు. తన కుక్కతోనూ దాడి చేయించాడు. ఇది గమనించిన అక్కడే ఉన్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ శామ్‌సన్ ఈనెల 26న మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీల ఆధారంగా మీర్‌పేట పోలీసులు 448,324,506,509 సెక్షన్ల కింద పాస్టర్‌పై కేసు నమోదు చేసి నిందితుడు దేవసహాయన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆమనగల్లు పట్టణంలో ఎరువుల దుకాణంలో ఎరువులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి

షాద్‌నగర్‌రూరల్ : రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్

విత్తనాల రసీదులు తీసుకోవాలి

కడ్తాల్ : రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీలత

- మండల వ్యవసాయ శాఖ అధికారులు
- రైతులకు అవగాహన సదస్సులు

కడ్తాల్, మే 29 : రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీలత అన్నారు. బుధవారం మండల పరిధిలోని న్యామతాపూర్, చల్లంపల్లి, వాసుదేవ్‌పూర్, మర్రిపల్లి గ్రామాల్లోని రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ..ప్యాకెట్‌పై విత్తనాల తయారైన తేదీని పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు. లూజు సంచుల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రమణ, వందన, అభినవ్, కేదార్‌సింగ్, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతోనే అధిక లాభాలు

ఆమనగల్లు : రైతులు సేంద్రియ వ్యవసాయంతోనే అధిక లాభాలు పొందవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారిణి అరుణకుమారి అన్నారు. మండల పరిధిలోని పోలేపల్లి, రాంనూంతల, రాంనూంతల గేట్ తండా, శెట్టిపల్లి, జంగారెడ్డిపల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో, ఏఈవోలు మాట్లాడుతూ..విత్తనాల కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏవో మాట్లాడుతూ.. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమాల్లో విస్తరణ అధికారులు రాణి, సాయిరాం, శివ తేజ, మీనాక్షి, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల సమాచారమివ్వండి

షాద్‌నగర్‌రూరల్ : నకిలీ విత్తనాలను ఎవరైనా విక్రయించినట్లు రైతుల దృష్టికి వస్తే సమాచారం ఇవ్వాలని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్ అన్నారు. నకిలీ విత్తనాలపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సు మండలంలోని రాయికల్, భీమారం, గంట్లవెల్లి, కొండన్నగూడ గ్రామాల్లో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలపై రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా లూజు సంచుల్లో ఉన్న విత్తనాలను ఎవరూ కొనుగోలు చేయరాదని సూచించారు. ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలను కొనులగోలు చేసిన తరువాత తప్పకుండా రసీదు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ముంపు సమస్యను పరిష్కరిస్తాం

ఎల్బీనగర్ , మే 29 : ఎల్బీనగర్ నియోజకవర్గంలో వరద ముంపు సమస్యలను పరిష్కారిస్తామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు.

కాలనీవాసుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టుకాలనీ, బీడీఎల్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆయా కాలనీల్లో పర్యటించి వరదనీటి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల్లో వరద ముంపు సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. గతంలోనే వరదనీటి ట్రంక్‌లైన్ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేశామని, అయితే ప్రైవేటు వ్యక్తి స్థలం ఇవ్వడానికి నిరాకరించారన్నారు. అయితే ప్రస్తుతం ఈ పనుల విషయంలో వేగాన్ని పెంచుతామని, ఎత్తు పల్లాలను చూసుకుని అధికారులు వరద నీటి ట్రంక్‌లైన్ పనులను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పనుల విషయంలో కాలనీవాసులు తమకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ రమేశ్‌బాబు, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు దీపావళి శ్రవణ్ శ్రీకాంత్ కాలనీవాసులు సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, మురళి, శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి

యువకుడి కోసం చెరువులో గాలింపు చేపడుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం, మే 29 : స్నేహితులతో కలిసి సరదాగా చెరువును చూసేందుకు వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నంలో జరిగింది. ఇబ్రహీంపట్నం ఎస్ఐ మైబెల్లి కథనం ప్రకారం.. ఆగాపల్లి గ్రామానికి చెందిన పూజారి శరత్‌చంద్ర(22) ఇంటర్ ద్వితీయ ఏడాది చదువుతున్నాడు. అతడి కుటుంబం ఇబ్రహీంపట్నంలో నివాసం ఉన్నది. బుధవారం శరత్‌చంద్ర తన స్నేహితులతో కలిసి ఇబ్రహీంపట్నం చెరువును చూసేందుకు పెద్ద తూము వద్దకు వచ్చా డు. అక్కడ నిలబడిన అతడు ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. భయాం దోళనకు గురైన స్నేహితులు ఈ విషయాన్ని శరత్‌చంద్ర తల్లిదండ్రులకు చెప్పగా వారు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన వచ్చిన పోలీ సులు గజఈతగాళ్లు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను రప్పించగా.. వారు ఐదు గంటల పాటు శ్రమించి చెరువు నుంచి యువకుడి మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సేవలను మున్సిపల్ అధికారులు, పోలీసులు అభినందించారు.

మృతుడు శరత్‌చంద్ర (ఫైల్)

విరాళాలు అందజేత

కొత్తూరు, మే 28: మున్సిపాలిటీ పరిధిలో పునర్నిర్మిస్తున్న గ్రామ దేవతల ఆలయాలకు దాతలను నుంచి విరాళాలు కొనసాగుతున్నాయి. గణేశ్ ట్రేడింగ్ యాజమాన్యం బుధవారం లక్ష రూపాయలను గ్రామ పెద్దలకు అందించారు. అలాగే కొత్తూరు తండాకు చెందిన రవీనాయక్ రూ. 55 వేలు, కొత్తూరుకు చెందిన గుబ్బలింగం గుప్తా రూ. రూ. 41 వేలు, కాస్యా బాలకృష్ణ, రూ. 31 వేలు, రూ. 25 వేలు మల్లెల యాదయ్య, రామంజపురం శ్రీనివాస్‌రెడ్డి రూ. 25 వేల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాదారం నర్సింహాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గణేశ్, బండి కృష్ణ, వడ్ల బాల్‌రాజ్, రాఘవేందర్ పాల్గొన్నారు.